# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక





సంపుటి : 01 | సంచిక : 260 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 28 ఆగస్టు 2026 | పేజీలు : 2







# నాణ్యమైన విద్యను అందించాలి

- విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**పాలకుర్తి, మన చౌరాస్తా :** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. గురువారం పాలకుర్తి మండలంలోని 'పీఎం శ్రీ' పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి, తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, వంటశాల మరియు పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నేరుగా విద్యార్థులతో ముచ్చటించి, హిందీ, ఇంగ్లీష్, గణితం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టుల్లో వారి అభ్యాస సామర్థ్యాన్ని పరీక్షించారు. అంతేకాకుండా బ్లాక్‌బోర్డ్‌పై గణితం, సాంఘిక శాస్త్ర పాఠాలను స్వయంగా బోధించి విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడానికే పరిమితం కాకుండా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి పెంపొందించాలని, వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు చెస్, వాలీబాల్, ఖోఖో, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు డిజిటల్ బోర్డులను సమర్థవంతంగా వినియోగించి కోడింగ్ వంటి నైపుణ్యాలు నేర్పించాలని ఆదేశించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ దెబ్బతిన్న కిటికీలు, ఫ్యాన్లు, పాత బెంచీల మరమ్మతులు చేపట్టాలని, ప్రత్యేకంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు. వంటశాల పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పిస్తే నిధులు మంజూరు చేస్తామని, విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎంపీడీఓ వేదవతి, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, సర్పంచ్ కె. విజయ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.




# 22 ఏ భూముల వివరాలను సమర్పించాలి

- రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్



**జనగామ, మన చౌరాస్తా :** 22ఏ కింద నమోదైన వ్యవసాయ, వ్యవసాయేతర భూములను గుర్తించి, నిర్ణీత ప్రొఫార్మాలో నివేదిక సమర్పించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి భూభారతి, 22ఏ నమోదులు, సమగ్ర రీసర్వే అంశాలపై జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. భూభారతి డేటా ఆధారంగా 22ఏ విస్తీర్ణంలో వ్యత్యాసాలు ఉంటే పోర్టల్‌లోనే పరిష్కరించాలని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు నివారించాలని సూచించారు. అలాగే ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని పైలట్ ప్రాజెక్ట్‌గా సమగ్ర భూ రీసర్వే చేపట్టాలని స్పష్టం చేశారు. వీసీ అనంతరం జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులతో మాట్లాడుతూ... మండలాల వారీగా 22ఏ భూముల వివరాలు సేకరించాలని, రీసర్వే కోసం సర్వేయర్లను నియమించాలని ఆదేశించారు. భూభారతి మాడ్యూల్స్‌లోని మ్యుటేషన్, సక్సెషన్, నాటి నాలా దరఖాస్తులతో పాటు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, సర్వే ఏడీ మన్యంకొండ, డి సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ కబడ్డీ న్యాయ నిర్ణీత పరీక్షలో జనగామ జిల్లా పీఈటీల ప్రతిభ



**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జూన్ 6, 7, 8 తేదీల్లో నిర్వహించిన AKFI జాతీయ కబడ్డీ న్యాయ నిర్ణీత పరీక్షలో జనగామ జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు చింతకింది సుధాకర్, నూకల రాజన్న, జెనిగల రాజు ఉత్తీర్ణత సాధించి జాతీయ స్థాయి కబడ్డీ అఫీషియల్స్‌గా అర్హత సాధించారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించేందుకు అర్హత సాధించడం పట్ల జనగామ జిల్లా కబడ్డీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. వీరి ప్రతిభకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి పోటీల్లో సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించేందుకు సహకరించిన తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేశం, ప్రధాన కార్యదర్శి మద్ది మహేందర్ రెడ్డి, అలాగే జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పోగుల సారంగపాణి, అధ్యక్షులు వై. కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్యలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా జనగామ జిల్లా కబడ్డీ అఫీషియల్స్, క్రీడాభిమానులు మరియు ఈ పరీక్ష విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## గిరిజనుల సంస్కృతికి తీజ్ పండుగ ప్రతీక: అరూరి రమేష్

**వర్ధన్నపేట, మన చౌరాస్తా :** వర్ధన్నపేట నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ గుండ్ల సింగారం పరిధిలోని బాలాజీ బంజార కాలనీ, నాయక్ నగర్, ఇందిరమ్మ కాలనీల్లో నిర్వహించిన తీజ్ నవరాత్రి ఉత్సవాల్లో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పాల్గొని గిరిజనులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తీజ్ పండుగ గిరిజన బంజారా సమాజ ఐక్యత, సంస్కృతులకు ప్రతీక అని పేర్కొన్నారు. సంప్రదాయ ఆచారాలను భావితరాలకు అందించడం అభినందనీయమని, సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో మాజీ కార్పొరేటర్ రవి నాయక్, మాజీ AMC డైరెక్టర్ గనిపాక విజయ్, రాజు నాయక్, PACS చైర్మన్ జక్కు రమేష్‌గౌడ్, నేరెళ్ల రాజు, పావుశెట్టి శ్రీధర్, ఏకాంతం గౌడ్, ప్రశాంత్, బొమ్మగాని వెంకటేష్, రాజేష్ పాల్గొన్నారు.



# ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

**టీజీఈజేఏసీ ధర్నా విజయవంతం**



**జనగామ, మన చౌరాస్తా :** ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ ఖాజా షరీఫ్ తీవ్రంగా డిమాండ్ చేశారు. టీజీఈజేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని చౌరస్తాలో నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఖాజా షరీఫ్ మాట్లాడుతూ కాలపరిమితి దాటి 3 సంవత్సరాలవుతున్నా ఉద్యోగులకు రావాల్సిన PRCని అమలు చేయకపోవడంతో తీవ్ర అసంతృప్తి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నిలిచిపోయిన 6 డిఏ (DA)లను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా CPSను రద్దు చేయాలని కోరారు. ఉద్యోగుల నుండి హెల్త్ కార్డుల కోసం కాంట్రిబ్యూషన్ తీసుకుంటున్నా నేటికీ కార్డులు మంజూరు చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. TGEJAC జిల్లా కార్యదర్శి కొర్నేలియస్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బిల్లులను చెల్లించకపోతే, వచ్చే సెప్టెంబర్ 10వ తేదీన రాష్ట్ర స్థాయిలో భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నాకు హాజరైన రాష్ట్ర బాధ్యులు రంజిత్ కుమార్, శ్రీనివాస్, కళావతి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమిష్టిగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మహా ధర్నాలో TGEJAC జిల్లా బాధ్యులు మహిపాల్ రెడ్డి, చంద్రశేఖర్ రావు, శ్రీనివాస్, రాజు, లక్ష్మణ మూర్తి, షరీఫ్, రామస్వామి, మహేందర్ రెడ్డి, హఫీజ్, వెంకటేష్, నాగార్జున, అంకుశావలి, శ్రీనివాస రావు, శ్రీనివాస చారి, కృష్ణ, సంపత్ కుమార్, రాం నర్సయ్య, అరుణ, లావణ్య, యశోద, పాషా, వివిధ శాఖల ఉద్యోగులు మరియు విశ్రాంత ఉద్యోగులు 300 మందికి పైగా పాల్గొన్నారు.



## జనగామ రవాణా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా 'వనమహోత్సవం'

**జనగామ, మన చౌరాస్తా :** వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జనగామ జిల్లా రవాణా శాఖ (RTO) కార్యాలయ ఆధ్వర్యంలో ఈరోజు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి (DTO) ఎం.ఆర్ శిల్ప ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పెరిగే మొక్కలే మానవాళికి స్వచ్ఛమైన గాలిని, భవిష్యత్తును అందిస్తాయని ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (AMVI) శ్వేత, నవితలతో పాటు కానిస్టేబుల్ వెంకటేష్, హోంగార్డులు శ్రీనివాస్, మూర్తి, కార్యాలయ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## ఇందిరమ్మ కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**జనగామ, మన చౌస్తారా :** బాణాపురం ఇందిరమ్మ కాలనీలోని పోచమ్మ తల్లి ఆలయం వద్ద మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. 5వ వార్డు కౌన్సిలర్ మిద్దెపాక భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు డ్రైనేజీ వ్యవస్థను విస్తరిస్తున్నామని, నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. వార్డు కౌన్సిలర్ భాస్కర్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి, 4వ వార్డు కౌన్సిలర్ మంత్రి సుమలత శ్రీశైలం, 6th వార్డు కౌన్సిలర్ బుక్క బాల భరద్వాజ్ (నాని) 10th వార్డు కౌన్సిలర్ బోనాసి రజనీ క్రాంతి, 19వ వార్డు కౌన్సిలర్ దోర్నాల అనిత వెంకటేశ్వర్లు,



వార్డు ఆఫీసర్ మంజుల, అంగన్వాడీ సభ్యులు, మహిళా సంఘం సభ్యులు మున్సిపల్ సిబ్బంది, జనగామ పట్టణ కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ అధ్యక్షులు పిట్టల సతీష్, గంగుల మల్లారెడ్డి, ఎండి అయోబ్, రఘు,బత్తుల శ్రీనివాస్, , గోరంతల సురేష్, మహిళా కాంగ్రెస్ నాయకులు గాడిపెల్లి సక్కుబాయి, ఉమా, పద్మ, దేవేంద్ర, సుమతి, బింగి సుజాత, కూరపాటి రమాదేవి, పతిపాక ఉమ, యూత్ నాయకులు కాసాని విజయ్,గోరంతల నాగరాజు, పాముకుంట్ల సందీప్, కాలనీ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.